నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, గురువారం 1 ఫిబ్రవరి 2024 | MAHABUBNAGAR NARAYANPET

విజేత టీమ్‌కు కప్‌ను అందజేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పోలీసులను ఆదర్శంగా తీసుకోవాలి

- ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు
- ముగిసిన పోలీస్ వార్షిక క్రీడలు

నాగర్‌కర్నూల్, జనవరి 31 : మనిషి ఆరోగ్యంగా ఉండేందుకు పోలీసులను ఆదర్శంగా తీసుకోవాలని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని క్రీడా మైదానంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వార్షిక క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్యంగా ఉండడానికి వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి వ్యక్తి కనీస వ్యాయామం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు పోలీస్ అధికారులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మనిషి ఆరోగ్యంగా ఉంటే మెదడు బాగా పనిచేస్తుందని తద్వారా మంచి విజయాలు సాధించవచ్చని తెలిపారు. ప్రతిగ్రామంలో క్రీడామైదానాలను ఏర్పాటు చేసి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు, సైనికులు ప్రతినిత్యం వ్యాయామం చేస్తూ ఆరోగ్యంగా ఉంటారని, అకుంటిత కార్యదీక్ష వల్ల ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే చేరుకొని పరిష్కరిస్తారని పోలీస్ సేవలను మంత్రి కొనియాడారు. పోలీస్ స్పోర్ట్స్‌మీట్ పెట్టినందుకు జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌ను మంత్రి అభినందించారు. ఆటల్లో ఆసక్తి ప్రతిభ ఉన్నవారిని గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇస్తూ ఒలింపిక్‌లో పాల్గొనే స్థాయికి ఎదగాలని, అందుకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. పోలీస్‌శాఖ మాత్రమే కాకుండా ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు వ్యాయామం, ఆటల పోటీల్లో పాల్గొనేలా అవగాహన కల్పించాలని సూచించారు. కలెక్టర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇంత పెద్ద ఎత్తున పోలీస్ స్పోర్ట్స్‌మీట్ జరగడం ఇదే తొలిసారి కావడంతో ఎస్పీని అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఇతర శాఖల సిబ్బంది క్రీడల్లో భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్పోర్ట్స్ మీట్ సందర్భంగా పాలుపంచుకున్న పోలీస్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మంత్రి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అదనపు ఎస్పీ రామేశ్వర్, డీఎస్పీ మోహన్ కుమార్, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్సై మహేందర్‌తో పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి..

చిన్నంబావి, జనవరి 31 : ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని మంత్రి జూపల్లి అన్నారు. మండలంలోని బెక్కెం, గడ్డబస్వాపురంలో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో గాంధీజీ కలలు గన్న స్వరాజ్యం దిశగా ముందుకుసాగుతుందని అందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని గ్రామాల్లో గ్రామ పంచాయతీ భవనాలను నిర్మించి సమగ్రాభివృద్ధి కోసం పాటుపడతామన్నారు. సర్పంచులు ఐదేండ్ల పాటు గ్రామాల్లో చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్, సర్పంచులు సత్యరాణి, పద్మ, రంజిత్ కుమార్, వైస్ ఎంపీపీ పుష్పలత, కాంగ్రెస్ నాయకులు చిదంబరరెడ్డి, ఈదన్న, రాంచంద్రారెడ్డి, బీచుపల్లియాదవ్, ఉమేశ్‌నాయుడు, ఎంపీవో రామస్వామి, ఉప సర్పంచ్ మాధవి, ఇంద్ర ఉన్నారు.

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు, బీఆర్‌ఎస్ నాయకులు

కేసీఆర్ పాలనలోనే విద్య బలోపేతం

- ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు రావడం అభినందనీయం
- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- స్వగ్రామంలో పాఠశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

ధరూరు, జనవరి 31 : కేసీఆర్ పాలనలోనే ప్రభుత్వ విద్య బలోపేతమైందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. తన స్వగ్రామమైన బూరెడ్డిపల్లిలో నిర్మించిన పాఠశాలను సతీమణి బండ్ల జ్యోతితో కలిసి ఎమ్మెల్యే బండ్ల ప్రారంభించారు. ముందుగా గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం అన్ని విధాలా సహకరించడంతోనే విద్యాభివృద్ధి సాధ్యమైందన్నారు. పల్లె ప్రగతి వంటి కార్యక్రమాలతో గ్రామాల రూపురేఖలే మారిపోయాయన్నారు. కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలు మాన్పించి ప్రభుత్వ బడుల్లో చేర్పించడం అభినందనీయమన్నారు. అన్ని మౌలిక వసతులతో పాఠశాలను నిర్మించిన జ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ బండ్ల జ్యోతి మాట్లాడుతూ పాఠశాల నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులందరి తరఫున ధన్యవాదాలు తెలిపారు. అయితే గ్రామస్తులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తామని సభాముఖంగా ప్రకటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మ, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఉప సర్పంచ్ రంగస్వామి, నాయకులు విజయ్, మహేందర్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రాధ, మధుమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అల్వాల్‌పాడులో పల్లె దవాఖాన ప్రారంభం..

అల్వాల్‌పాడు గ్రామంలో పల్లె దవాఖాన, సెంట్రల్ లైటింగ్‌ను ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సర్కారు ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు చర్యలు తీసుకున్నదని, అందులో భాగంగానే పల్లె దవాఖానను ప్రారంభించుకున్నామని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రహరీ పనుల పరిశీలన..

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ప్రహరీ పనులను ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్లు, కరపత్రాలు, ఫ్లెక్సీని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

జోగుళాంబ ప్రాశస్త్యం విస్తరించాలి

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- జోగుళాంబ వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్ విడుదల

అలంపూర్, జనవరి 31 : ఐదో శక్తి పీఠమైన జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల చరిత్ర, ప్రాశస్త్యం నలుదిశలా వ్యాపించాలని, దక్షిణకాశీగా విరాజిల్లుతున్న అలంపురం క్షేత్రం దినదినాభివృద్ధి చెందాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. బుధవారం అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయా ల్లో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజు, ఆలయ పాలక మండలి కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు, ఈవో పురేందర్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే విజయుడు వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్, ఫ్లెక్సీని విడుదల చేశారు. ముందుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 14న వసంత పంచమి అమ్మవారి ప్రాణప్రతిష్ట చేసిన శుభదినాన్ని పురస్కరించుకొని ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, ఆలయ పాలక మండలి సభ్యులతోపాటు అర్చకులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వేరుశనగ @ రూ.7,346

జడ్చర్ల, జనవరి 31 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం వేరుశనగకు అత్యధికంగా క్వింటాకు రూ.7,346 ధర పలికింది. బుధవారం బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు వేరుశనగ, కందులు, ఆముదాలు, ధాన్యం, మొక్కజొన్న, వేరుశనగ, జొన్నలు, బెబ్బర్లు, అమ్మకానికి వచ్చాయి. మార్కెట్‌కు 4,503 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.7,346, కనిష్ఠంగా రూ.4,002, మధ్యస్తంగా రూ.7,089 ధర పలికింది. 21క్వింటాళ్ల కందులు అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.9,649, కనిష్ఠంగా రూ. 9,179, మధ్యస్తంగా రూ.9,559 ధర పలికింది. 28 క్వింటాళ్ల ఆర్ఎన్ఆర్ రకం ధాన్యం అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ. 3,061 వచ్చింది. అదేవిధంగా జొన్నలకు క్వింటా కు గరిష్ఠంగా రూ. 5,622, బెబ్బర్లు క్వింటాకు గరిష్ఠంగా రూ.6,851, మొక్కజొన్నకు క్వింటాకు గరిష్ఠంగా రూ.2,377, ఆముదాలు క్వింటాకు గరిష్ఠం గా రూ.5,070, పత్తికి క్వింటాకు గరిష్ఠంగా రూ. 6,789 ధర వచ్చినట్లు అధికారులు తెలిపారు.

రేపటి నుంచి ప్రత్యేకాధికారులు..

ఫిబ్రవరి 1వ తేదీతో సర్పంచుల పదవీకాలం ముగుస్తుంది. ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రభుత్వ నిర్ణయం మేరకు రేపటి నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారులను నియమించడం జరుగుతుంది. జిల్లాలోని 461 గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారుల ఎంపిక పూర్తైంది. శుక్రవారం నుంచి ప్రత్యేక అధికారులు బాధ్యతలు తీసుకుంటారు. పంచాయతీ రాజ్ శాఖ నిబంధనల మేరకు గ్రామాల్లో అభివృద్ధి, వేసవిలో తాగునీటి సరఫరాలాంటి అంశాల్లో సమస్యలు కలగకుండా చర్యలు తీసుకుంటాం.

– కృష్ణ, డీపీవో, నాగర్‌కర్నూల్

అనంతవరం గ్రామం వ్యూ

పల్లెల్లో ప్రత్యేక పాలన

- ఉమ్మడి జిల్లాలోని 1,692 జీపీల్లో రేపటి నుంచి అధికారులకు బాధ్యతలు
- ఇప్పటికే పూర్తయిన ప్రత్యేకాధికారుల ఎంపిక
- ముగిసిన ప్రథమ పౌరుల పాలన
- ఓటమి భయంతోనే ఎన్నికలను వాయిదా వేసిన రాష్ట్ర ప్రభుత్వం
- అభివృద్ధి పనులపై ప్రభావం

నాగర్‌కర్నూల్, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : పల్లెల్లో ప్రథమ పౌరులైన సర్పంచుల పాలన బుధవారంతో ముగిసింది. ఈనెల 2వ తేదీ నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారులు అజమాయిషీ చేయనున్నారు. ప్రజా ప్రభుత్వంగా చెప్పుకొంటూ ముందుకు సాగుతున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెనుకంజ వేసింది. రాజకీయ ఉద్దేశంతో ఎన్నికలను పక్కనపెట్టి అధికారులతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ పరిణామాల ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధిపై తాజాగా మాజీలవుతున్న సర్పంచులతోపాటు ప్రజల్లోనూ భయాందోళన నెలకొన్నది.

గ్రామాలు ఇక ప్రత్యేకాధికారుల పాలన కిందకి రానున్నాయి. ఐదేండ్లుగా ప్రజలతో ప్రత్యక్షంగా ఎన్నుకోబడిన సర్పంచుల స్థానంలో అధికారులు పరిపాలించబోతున్నారు. చివరగా 2019లో పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఈ క్రమంలో ఫిబ్రవరి 1తో సర్పంచుల పదవీకాలం ముగుస్తుంది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల నిర్వహించడానికి విముఖత చూపింది. గత డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా బీఆర్‌ఎస్ ప్రతిపక్షంగా మారింది. కేసీఆర్ హయాంలో గ్రామ పంచాయతీలు గతంలో లేనంతగా అభివృద్ధి సాధించాయి. గ్రామాల్లో సీసీ రోడ్లు, ఎల్ఈడీ బల్బులు, నూతన పంచాయతీ భవనాలు, భూగర్భ డ్రేనేజీలు, మురుగు కాల్వల నిర్మాణం, తండాలు పంచాయతీలుగా మారడం, కొత్త పంచాయతీల ఏర్పాటుతో ఎంతో అభివృద్ధి చోటు చేసుకున్నది. అదే విధంగా వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డు, రైతు వేదికల నిర్మాణాలు జరిగాయి. మిషన్ భగీరథ పథకంతో ఇంటింటికీ శుద్ధ జలం అందుతోంది. ఫలితంగా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన ప్రత్యేకంగా నిలిచింది. ఈ క్రమంలో చేపడుతూ వచ్చిన పలు అభివృద్ధి పనులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అభివృద్ధి పనులను ముందుకు సాగిస్తుందనే నమ్మకం తాజా సర్పంచులతోపాటు ప్రజల్లోనూ ప్రశ్నార్థకంగా మారింది. అయితే అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మెజార్టీ సంఖ్యతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ సర్పంచ్ ఎన్నికలను నిర్వహించేందుకు సాహసించలేదనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నది. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధితో బీఆర్‌ఎస్‌పై ప్రజల్లో ఇంకా ఆదరణ చెక్కు చెదరలేదు. దీంతో ఈ ఎన్నికలు నిర్వహిస్తే గర్వ భంగం కలుగుతుందని, తద్వారా పార్లమెంట్ ఎన్నికలపై ప్రభావం పడుతుందనే అనుమానం ప్రభుత్వ పెద్దల్లో ఏర్పడి ప్రత్యేకాధికారులతో ముందుకు సాగేలా నిర్ణయించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి గ్రామాల్లో ప్రథమ పౌరులైన సర్పంచుల స్థానంలో ప్రత్యేకాధికారులు బాధ్యతలు తీసుకోబోతున్నారు. ఇప్పటికే ఎంపీడీవోలు పంచాయతీరాజ్ శాఖకు సిద్ధం చేసిన అధికారుల జాబితాను పంపించారు. ఫలితంగా గ్రామాలకు తాసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏవోలు, ఏఈలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వంటి పలు శాఖల అధికారులను పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా నియమించనున్నారు. ఇదే కోవలో సర్పంచుల నుంచి చెక్ బుక్‌లు, డిజిటల్ సంతకాల కీలను తీసుకోనున్నారు. ఇప్పటి వరకు సర్పంచ్, ఉప సర్పంచులకు ఉన్న జాయింట్ పవర్‌ను ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతో అనుసంధానించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలు కోసం ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించింది. క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించడం, లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉన్నది. దీనికి ప్రజలచే ఎన్నుకోబడ్డ గ్రామ సభ కచ్చితంగా అవసరం ఉంటుంది. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంట్, పింఛన్, రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపికలో ప్రజల పాత్ర లేకుండా అధికారులే చేపడితే పారదర్శకత లోపించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ హయాంలో సర్పంచులతో కూడిన పాలక మండలి లేకుండా అధికారుల పరిపాలనలోకి తీసుకురావడంతో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గ్రామ పంచాయతీ కార్యాలయం

గ్రామ పంచాయతీల్లో పెండింగ్ పనుల కొనసాగింపుతోపాటు అభివృద్ధిలో ముందు కు తీసుకెళ్లాలంటే పదవీ కాలాన్ని పొడిగిస్తే బాగుంటుందని సర్పంచులు, ప్రజలు భావిస్తున్నారు. ఏదేమైనా శుక్రవారం నుంచి ఉమ్మడి పాలమూరులోని 1,692 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన రానున్నది.

తీగ లాగితే కదిలిన డొంక

- పత్తి విత్తనాల గోల్‌మాల్‌పై ఆరా

గద్వాల అర్బన్, జనవరి 31 : పత్తి విత్తనాల గోల్‌మాల్‌లో తీగ లాగితే డొంక కదిలినట్లు విస్తృత నిజాలు బయటపడ్డాయి. జనవరి 13వ తేదీన పత్తి విత్తనాల గోల్‌మాల్ అనే కథనం నమస్తే తెలంగాణ దినపత్రికలో రావడంతో కంపెనీ నిర్వాహకులు, ప్రభుత్వ అధికారులు ఆరా తీస్తున్నారు. సీడ్ ఆర్గనైజర్లు 10 లక్షల ప్యాకెట్లకుపైగా బ్లాక్ మార్కెట్‌కు తరలించి కోట్ల రూపాయలు దండుకున్నట్లు గుసగుసలు వినబడుతున్నాయి. వాస్తవానికి సీడ్ కంపెనీలు సీడ్ విత్తనాలను ఆర్గనైజర్ల సాయంతో రైతులకు అందజేసి సాగు అనంతరం విత్తనోత్పత్తి చేసి రైతుల నుంచి విత్తనాలను తిరిగి కంపెనీ నిర్వాహకులకు అందజేయాలి. ఈ క్రమంలో రైతులు పండించిన విత్తనాల నాణ్యతను పరిశీలించి రూ. 600–650 ధరతో రైతులకు చెల్లిస్తారు. అయితే ఈసారి సరైన సమయంలో వర్షాలు రాకపోవడంతో సరిగ్గా పంటలు పండలేదు. ఈ క్రమంలో వానకాలం పంటకు విత్తనాల అవసరాన్ని గుర్తించిన కొన్ని కంపెనీలు సీడ్ ఆర్గనైజర్లకు అత్యధిక డబ్బులు ఎరగా చూపి సీడ్ విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించారు. కంపెనీల ఒప్పందాలను ఒక రాజకీయ నాయకుడు (సీడ్ ఆర్గనైజర్) తుంగలో తొక్కి తన పలుకుబడిని ఉపయోగించి కంపెనీకి ఇవ్వాల్సిన సీడ్ పత్తి విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించి కోట్ల రూపాయలు దండుకున్నట్లు సీడ్ ఆర్గనైజర్లలో చర్చ కొనసాగుతున్నది. ఒప్పందం మేరకు కంపెనీకి సీడ్ విత్తనాలు ఇవ్వలేదని రాజకీయ నాయకుడికి కంపెనీ నిర్వాహకులు నోటీసులు అందజేశారు. ఈ విషయంపై సదరు రాజకీయ నాయకుడు స్పందించకపోవడంతో కంపెనీ నిర్వాహకులు రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించగా వారి సూచన మేరకు జిల్లా అధికారులు, కంపెనీ నిర్వాహకులు కలెక్టర్, ఎస్పీని ఆశ్రయించి సమస్యను వివరించారు. ఈ విషయంపై జిల్లా అధికారులు స్పందించి రాజకీయ నాయకుడు, ఆయన భార్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు రహస్యంగా విచారణ చేపట్టారు. అయితే సదరు రాజకీయ నాయకుడి పత్తి మిల్లుపై సోదాలు నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. మిల్లులో ఈ ఏడాది ఎంత పత్తి వచ్చింది..ఎన్ని విత్తనాలను తీశారు..పూర్తి స్థాయిలో లెక్కలు తీయాలని జిల్లా అధికారులకు సూచించింది. ఈ వ్యవహారం నడుస్తున్న క్రమంలో సదరు రాజకీయ నాయకుడు తన పలుకుబడిని ఉపయోగించి తనపై నమోదైన కేసును రహస్యంగా ఉంచేందుకు, తన మిల్లును సోదా చేయకుండా ప్రభుత్వ అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. కేసు నమోదై రోజులు గడుస్తున్నా నేటికీ సదరు రాజకీయ నాయకుడిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

విచారణ చేపట్టాం

నూజివీడు కంపెనీ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు సీడ్ ఆర్గనైజర్, ఆయన భార్యపై కేసు నమోదు చేశాం. ఈ విషయానికి సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాం. కేసులో పలు కీలక విషయాలు తెలిసినట్లు పేర్కొన్నారు.

- వెంకటేశ్వర్లు, డీఎస్పీ

కార్యకర్తలకు అండగా ఉంటా..

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 31 : బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అన్ని వేళల్లో అందుబాటులో ఉంటూ వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని పాతపాలమూరుకు చెందిన ఖాదరయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డితో కలిసి వారి కుటుంబ సభ్యులకు బీఆర్‌ఎస్ నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో బుధవారం అందజేశారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. త్వరలోనే గ్రామ, వార్డు స్థాయిలో పార్టీ పటిష్టతకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని.. ప్రజల్లో ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభమైందని వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ బీమా చెక్కును అందజేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

రిజిస్ట్రార్ దంపతులను సన్మానిస్తున్న పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, ప్రొఫెసర్లు

రిజిస్ట్రార్ సేవలు మరువలేనివి

- పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్

పాలమూరు, జనవరి 31: పీయూ రిజిస్ట్రార్ గిరిజామంగతాయారు సేవలు మరవలేనివని పీయూ ఉపకులపతి లక్ష్మీకాంత్‌రాథోడ్ అన్నారు. బుధవారం రిజిస్ట్రార్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని పీయూ లైబ్రరీ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మంగతాయారు రిజిస్ట్రార్‌తోపాటు వివిధ హోదాల్లో ఎంతో నిజాయితీగా, నిక్కచ్చిగా పనిచేశారన్నారు. ముఖ్యంగా యూనివర్సిటీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని వివరించారు. అనంతరం వీసీతోపాటు ప్రొఫెసర్లు, అధ్యాపకులు రిజిస్ట్రార్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, ఆడిట్ సెల్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డితోపాటు వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు, పీయూ సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్యశాఖ ఉద్యోగి సస్పెండ్

మహ్మదాబాద్, జనవరి 31 : గణతంత్ర దినోత్సవం రోజున మద్యం మత్తులో జాతీయ జెండాను ఎగురవేసే ప్రయత్నం చేసిన ప్రభుత్వ ఉద్యోగి జనార్దన్‌ను కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పశువైద్యాధికారులు బుధవారం సస్పెండ్ చేశారు. జనవరి 26న పూటుగా మద్యం తాగి జెండాను ఎగురవేస్తానని, ఇష్టం వచ్చినట్లు వ్యవహరించిన ప్రభుత్వ ఉద్యోగి జనార్దన్‌ను గ్రామస్తులు అడ్డుకొని అక్కడే పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగితో జెండాను ఆవిష్కరింపజేసిన సంగతి విదితమే. ప్రభుత్వ ఉగ్యోగి నిర్వాకంపై 'మద్యం మత్తులో ప్రభుత్వ ఉద్యోగి' అనే కథనం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితం కావడంతో సదరు జిల్లా అధికారులు విచారణ చేపట్టి ఆయనపై చర్యలు తీసుకున్నట్లు ఉమ్మడి మండల పశువైద్యాధికారి నరేందర్ తెలిపారు.

3న ఇంటర్వ్యూలు

నారాయణపేట టౌన్, జనవరి 31 : పట్టణంలోని నైపుణ్య శిక్షణాభివృద్ధి కేంద్రంలో ఫిబ్రవరి 3వ తేదీన హైదరాబాద్‌లోని ధరణి గ్రూప్ ఆఫ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ కంపెనీలో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీహర్ష బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.25 వేల వేతనం ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే పదో తరగతి, ఆపై అర్హత ఉన్న అభ్యర్థులకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లీడర్స్ పోస్టులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఈ పోస్టులకు ఎలాంటి అనుభవం అవసరం లేదన్నారు. మరిన్ని వివరాలకు 9392121201 ఫోన్‌నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తిమ్మాజిపేట, జనవరి 31 : కనిపించకుండా పోయిన వ్యక్తి శవమై కనిపించడంతో అతడి మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తిమ్మాజిపేట మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన పొట్ట యాదయ్య(45) మంగళవారం సాయంత్రం కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు ఆయన కోసం చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. తీరా బుధవారం తెల్లవారుజామున తన వ్యవసాయ పొలం పక్కన శవమై కనిపించగా, అతని మెడకు చిరిగిన టవల్ చుట్టి ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

అయితే గ్రామానికి చెందిన మరో ఇద్దరితో కలిసి మంగళవారం సాయంత్రం మద్యం తాగి అతడు తిరిగి ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ ఇద్దరే యాదయ్యను హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఉదయం పెద్ద సంఖ్యలో గ్రామస్తులు తిమ్మాజిపేట పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని యాదయ్య మృతిపై విచారణ నిర్వహించాలని పోలీసులను కోరారు. అనంతరం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుమారుడు శివప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాతే యాదయ్య మృతికి సంబంధించిన వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.